క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సెల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి ఎల్లారెడ్డి ఎస్సై గణేష్ బుధవారం సెల్‌ఫోన్‌ను అందించారు. ఎస్సై తెలిపిన వివరాలు.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన బట్టు మహేందర్ మార్చి 8న ఎల్లారెడ్డిలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడని, సీఈఐఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడంతో బాధితుడి ఫోన్‌ను ఎల్లారెడ్డిలో ట్రేస్ చేసి పట్టుకున్నారు. ఫోన్‌ను మహేందర్‌కు అందించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



లింగంపేట(ఎల్లారెడ్డి): కోమట్‌పల్లి గ్రామానికి చెందిన వేల్పుల విజయకు ఇంజినీరింగ్‌లో సీటు వచ్చింది. విజయకు చదువుకునే స్తోమత లేకపోవడంతో ట్యూషన్ ఫీజును బిగ్ హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. విద్యార్థి చదువులో ప్రతిభ కనబర్చి ఉన్నత విద్యలో రాణిస్తుండటంతో ట్యూషన్ ఫీజు రూ.47,300 ఆర్థిక సాయంగా చెల్లించేందుకు ముందుకు వచ్చినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పేద విద్యార్థులకు తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కృష్ణాకర్, అరుణ్‌కుమార్, నిఖిల్, హాజి, మురళి, అనిల్, రాఘవేందర్, వజీర్, రాకేష్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్‌లెట్ల దానం

కామారెడ్డి అర్బన్: డెంగీతో ప్రాణాపాయస్థితిలో ఉన్న పట్టణానికి చెందిన శేఖర్, కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రక్తదాతల సమూహం ద్వారా కరీంనగర్‌కు చెందిన గాలిపెల్లి కుమార్ బి–పాజిటివ్ ప్లేట్‌లెట్ల దానం చేసినట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం, ప్లేట్‌లెట్లు ఇవ్వడానికి కామారెడ్డి రక్తదాతల సమూహంలో యువకులు చేరాలని బాలు కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామానికి చెందిన సంగం సుజాత శ్రీనివాస్‌రెడ్డికి మంజూరైన రూ.20 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం గ్రామ ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ ఆపన్నహస్తంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రావణి, ఉపసర్పంచ్ మంద శ్రీనివాస్, నాయకులు కమతాల శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, సయ్యద్ అమీన్, మన్నె నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

మద్నూర్(జుక్కల్): వాహనాలలో ప్రమాదకరంగా, మోతాదుకు మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని అన్నారు. మండలంలోని మేనూర్ వద్ద రహదారిపై బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ సందర్భంగా డబ్బులు తరలకుండా అక్కడక్కడ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించి హెచ్చరించారు.

స్పీకర్‌కు బైరాపూర్ గ్రామస్తుల మద్దతు



బాన్సువాడ : బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన వివిధ కుల సంఘాల సభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ తీర్మానం చేసిన పత్రాలను ఆయనకు అందజేశారు. బైరాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్, ముస్లిం, నాయీబ్రాహ్మణ, కుమ్మరి, కమ్మరి, రజక కుటుంబ సభ్యులు ఏకగ్రీవంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డికే తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, జెడ్పీటీసీ స్వరూప, సర్పంచి అంజవ్వ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



తాడ్వాయి/సదాశివనగర్: తాడ్వాయి మండల కేంద్రంతో పాటు సదాశివనగర్ మండలంలోని అమర్లబండ, తుక్కోజివాడి, భూంపల్లి గ్రామాల్లో పలు కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- ఒక్కసారి అవకాశమివ్వండి
- జుక్కల్ బీజేపీ అభ్యర్థి అరుణతార



బీజేపీలో చేరుతున్న లింగంపల్లి యువకులు



జుక్కల్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి అరుణతార

నిజాంసాగర్(జుక్కల్): భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఒక్కసారి అవకాశమిచ్చి చూడాలని జుక్కల్ బీజేపీ అభ్యర్థి అరుణతార అన్నారు. బుధవారం జుక్కల్ మండల కేంద్రంలో మొదటి సారి ఆమె ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. గతంలో తాను చేసిన అభివృద్ధి తప్పా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అవినీతి, అరాచక పాలనను సాగనంపడానికి ప్రజలు చైతన్యవంతులుగా ఉండాలన్నారు. ఆమె వెంట మండల బీజేపీ అధ్యక్షుడు శివాజీ పటేల్, యువకులు పాల్గొన్నారు.

బీజేపీలో యువకుల చేరిక

బిచ్కుంద/పెద్దకొడప్‌గల్(జుక్కల్): బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార ఆధ్వర్యంలో బుధవారం లింగంపల్లి గ్రామానికి చెందిన యువకులు బీజేపీలో చేరారు. అరుణతార యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ప్రత్యామ్నాయంగా ప్రజలు బీజేపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి కేంద్రం పథకాల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల సమస్యలను తెలుసుకోండి



పట్టణ కార్యకర్తలతో మాట్లాడుతున్న కాటిపల్లి వెంకటరమణారెడ్డి

- రానున్న 35 రోజులు కీలకం
- పట్టణ కార్యకర్తలతో బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి కేవీఆర్

కామారెడ్డి టౌన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవాలని బీజేపీ పట్టణ కార్యకర్తలకు బీజేపీ కామారెడ్డి అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్) సూచించారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

రానున్న 35 రోజులకు చాలా కీలకమని, క్షేత్రస్థాయిలో ప్రజలకు పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అనుసరిస్తున్న విధానాలు, గెలుపు కోసం చేయాల్సిన వ్యూహాల గురించి చర్చించారు. కామారెడ్డి అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త పార్టీ కోసం సమయం ఇచ్చి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు విపుల్, కౌన్సిలర్లు, నాయకులు శ్రీకాంత్, సురేష్, ప్రవీణ్, నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం



అంతంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు



రాజంపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

భిక్కనూరు: అంతంపల్లి గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, నర్సింలు, బాబు, మల్లేష్, సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పార్టీలో హామీ ఇచ్చిన గ్యారంటీ పథకాల పత్రాలను స్థానిక పిట్టల గైన కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు పంపిణీ చేస్తూ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రాజంపేట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు యాదవ రెడ్డి, సీనియర్ నాయకులు వీరన్న, బాలకిషన్, యూత్ అధ్యక్షుడు అంకం క్రిష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్

దోమకొండ: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి నవరాత్రుల ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడిబియ్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమతో ఊరేగింపు నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఉండాలని షబ్బీర్ అలీ అన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత, మాజీ ఎంపీపీ రామస్వామిగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నం నారాయణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యసాయి భక్తుల నగర సంకీర్తన, భజనలు

కామారెడ్డి అర్బన్: సత్యసాయి సేవా సమితి కామారెడ్డి సెంటర్ ఆధ్వర్యంలో గురువారం నగర సంకీర్తన నిర్వహించారు. సాయంత్రం సాయి భక్తుడు కేవీ అశోక్‌కుమార్ ఇంట్లో భజన కార్యక్రమం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతిరోజు సాయి భక్తుల ఇళ్లలో సామూహిక భజనలతో పాటు, నగర సంకీర్తన చేస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

టిఫిన్ చార్జీలు రూ.25 చొప్పన చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న ఎండీఎం నిర్వాహకులు

ఎల్లారెడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే టిఫిన్ చార్జీలు రూ.25 చెల్లించాలని కోరుతూ ఎండీఎం నిర్వాహకులు బుధవారం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. టిఫిన్ చార్జీలను ప్రభుత్వం ఒక విద్యార్థికి రూ.10.50 చొప్పున కేటాయించారని, ఇంత తక్కువ కేటాయించడంతో నిర్వాహకులకు గిట్టుబాటు కావడం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్లేట్‌కు రూ.25 చొప్పున చెల్లించాలని వారు కోరారు. ఎండీఎం నిర్వాహకులు సావిత్రి, సోఫియా, సంగీత తదితరులున్నారు.

కలుషితమవుతున్న తాగునీరు



కుళాయి ద్వారా సరఫరా అయిన మురికి నీరు

బిచ్కుంద(జుక్కల్): గ్రామ పంచాయతీ నుంచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా మాటలు రికార్డులకే పరిమితమవుతున్నాయి. ప్రజలకు మాత్రం కలుషితమైన తాగు నీరు అందిస్తున్నారు. మండల కేంద్రంలో కుళాయి తాగునీరు కలుషితమవుతున్నాయి. మిషన్ భగీరథ తాగు నీటి సరఫరాలో మురికి నీరు రావడంతో ప్రజలు నీటిని వృథాగా వదిలేస్తున్నారు. పైపు లైన్ లీకేజీ ఉండటంతో మురికి కాలువ నీరు పైపులలో చేరి మురికి వస్తోంది. బస్టాండ్ వద్ద ఉన్న ట్యాంకు నుంచి సరఫరా అవుతున్న నీరు మురికిగా వస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా మరమ్మతులు చేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దళారులకు ధాన్యం అమ్మొద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

బాన్సువాడ : రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని బీర్కూర్ తహసీల్దార్ జనార్దన్ అన్నారు. బుధవారం బీర్కూర్, కిష్టాపూర్, చించొల్లి, బరంగెడ్గి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని, తూకం చేసిన రెండు, మూడు రోజుల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని అన్నారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని అన్నారు. ఏఈవో శ్రావణ్, సహకార సంఘం సీఈవో విఠల్, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

జిల్లాలో దుర్గామాత శోభాయాత్ర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని ట్రాక్టర్లలో ఉంచి ప్రధాన వీధుల గుండా డీజే, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారణ స్వాములు, గ్రామస్తులు, యువకులు నృత్యాలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో అమ్మవారిని నిమజ్జనం చేశారు. అంతకు ముందు దుర్గామాత మండపాల వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



నస్రుల్లాబాద్‌లో యువ భారత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర



ఎల్లారెడ్డిలో యువకుల నృత్యాలు



దేవునిపల్లిలో..



నిజాంసాగర్: దుర్గామాత మండపం వద్ద భక్తులు



భిక్కనూరులో..

లడ్డూ వేలం పాట



లింగంపేట(ఎల్లారెడ్డి): పోతాయిపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మంగళవారం లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన తోట ప్రతిభ రూ.50,101 దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం దుర్గామాత శోభాయాత్ర నిర్వహించారు.

విండో పాలకవర్గ సమావేశం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డిలో సింగిల్ విండో పాలకవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విండో చైర్మన్ సదాశివరెడ్డి మాట్లాడుతూ.. విండో పరిధిలోని గ్రామాల్లో ఎక్కడ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అవసరమవుతాయో అక్కడ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత విండో డైరెక్టర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, విండో సీఈవో కడెం భైరయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ కరపత్రాల ఆవిష్కరణ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు బుధవారం కర పత్రాలను ఆవిష్కరించారు. నవంబర్ 7న హైద్రాబాద్‌లో జరిగే విశ్వరూప మహాపాదయాత్ర ముగింపు ఉత్సవం నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు పద్మారావు తెలిపారు. అక్టోబర్ 7న ఆలంపూర్‌లో మందకృష్ణమాదిగ మహాపాదయాత్ర ప్రారంభించారని, పాదయాత్ర నవంబర్ 7న హైద్రాబాద్‌కు చేరుకుని అక్కడ ముగుస్తుందన్నారు. ముగింపు కార్యక్రమానికి వేలాది మంది ఎంఆర్‌పీఎస్ నాయకులు తరలిరావాలని ఆయన కోరారు.

మూగజీవాలకు కలుషిత నీరే దిక్కు



పులికుచ్చతండాలోని నీటితొట్టి

బాన్సువాడ రూరల్: మూగజీవాల దాహార్తిని తీర్చడానికి గ్రామాల్లో నిర్మించిన నీటితొట్టిల నిర్వహణను గ్రామ పంచాయతీ సిబ్బంది గాలికి వదిలేశారు. నెలల తరబడి తొట్టిలను శుభ్రం చేయించకపోవడంతో తొట్టిలో పాకురు, చెత్తాచెదారం చేరి నీరు కలుషితమవుతున్నాయి. పశుసంపదకు నిలయమైన తండాల్లో మూగజీవాలకు కలుషిత నీరే దిక్కవుతున్నాయి. అధికారులు దృష్టిసారించి మనుషులతోపాటు మూగజీవాలకు స్వచ్ఛమైన నీటిని అందిచాలని తండా ప్రజలు కోరుతున్నారు.

సమాచారం..

నేడు శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెదలో గురువారం శబరిమాత ఆశ్రమ 34వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు శబరిమాత భజన మండలి సభ్యులు తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా ఉదయం 5 గంటలకు గీతాపారాయణం, 7.30గంటలకు ధ్వజారోహణం, 8–10 గంటల వరకు అమ్మవారి పల్లకిసేవ, 11.30గంటలకు పాదుకాపూజ నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. రాత్రి 9గంటలకు ఆశ్రమం వద్ద భజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతుల సమావేశం

కామారెడ్డి టౌన్: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో నేడు మాస్టర్ ప్లాన్ రైతుల జేఏసీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి పట్టణ, గ్రామాల బాధిత రైతులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హాజరవుతారని ఆయన ప్రకటించారు.

హనుమాన్ ఆలయ శిఖర పున:ప్రతిష్ఠాపన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): తుబ్‌దాల్ గ్రామంలో హనుమాన్ ఆలయంపై ఖత్గుప్ మహరాజ్ శ్రీమల్లికార్జునప్ప ఆధ్వర్యంలో శిఖర ప్రతిష్ఠాపన నిర్వహించారు. గ్రామంలో కోతుల బెడదతో హనుమాన్ ఆలయంపై ఉన్న శిఖరం విరిగిపోవడంతో ఖత్గుప్ మహరాజ్ శ్రీ మల్లికార్జునప్ప స్వామి సూచనల మేరకు హనుమాన్ ఆలయ శిఖర పున:ప్రతిష్ఠాపన చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కళకళలాడుతోన్న కంది పంట



మద్నూర్(జుక్కల్): ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురవడంతో మండలంలో వేసిన కంది పంట కళకళలాడుతోంది. పంటను చూసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పప్పు దినుసుల పంటలకు ప్రభుత్వ ఎంఎస్‌పీ ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మార్కెట్‌లో కంది పప్పు ఆశించినంత ధర క్వింటాలుకు రూ.10 వేల పైనే ఉండటం వల్ల మండలంలోని రైతులు పత్తి, సోయా పంటల్లో, పొలాల గట్లపై అంతర పంటగా కందిని సాగు చేశారు. మండలంలోని సుల్తాన్‌పేట్, పెద్ద తడ్గూర్, మద్నూర్, అవాల్‌గావ్, డోంగ్లీ, మేనూర్, కోడిచిర తదితర గ్రామాల్లో కందిని సాగు చేశారు. ప్రస్తుతం కంది పంట పూత దశ ప్రారంభమైంది. మండలంలో 2 వేల ఎకరాల్లో కంది సాగు అవుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు.